# అబోతు

శ్రీ వేమూరి సీతారామమూర్తి.

ఒరే, రామం, అటుచూడరా! చిత్రం; కుక్క, అబోతుని బెదిరించి తరిమివేస్తున్నది.

ఔను, కాలధర్మం, మరి!.........

'అనగా......'

'ఏ ప్రాణికైనా, ఎల్లకాలం ఒక్కరీతిగా జరగదు చూడు. 'ఏ కాలంబున కేదిగతియో...' అని ఎవరో కవిచెప్పినట్లు...ఇంతకీ, కుక్క, దాని పాతవైరం తీర్చుకుంటున్నది.'

'నాకేమీ అర్థంకాలేదు నువ్వు చెప్పేది.'—

'నీకేమి అర్థమవుతుంది, చిన్నవాడివి! ఆ అబోతుని నువ్వెరగవు. నా చిన్నతనంలో అది ఎంత పొగరుగాఉండేది. ఈ ఊళ్లో అదిస్వేచ్ఛగా రాజ్యంచేసేది. ఆ రోజుల్లో దాన్ని ఎవరూ అడ్డుపెట్టలేక పొయ్యేవారు. దాని బలానికి కొందరు భయపడేవారు. దాని ఘనమైన ఆకారంచూసి గౌరవించేవారు కొందరు. అది మార్కెట్టులోకివెళ్లి, ఏ దుకాణంపైకి దండెత్తినా, ఇతరులుచూసి, దాని ధైర్యానికి హర్షించేవారు. పైగా చిట్టు, తవుడు, శెనగలు ఇత్యాదికట్నాలు చెల్లించేవారు దానికి. అది రోడ్డుమీద నడుస్తూఉండగా, ఎంత ఘరానామనిషైనా, గొడుగుముడిచి, పక్కకి తప్పుకోవల్సిందే. ఇల్లు మరమ్మతుకొరకు, గుమ్మంముందు సున్నమో, ఇసుకో, ఏ గృహస్థైనా వేయించుకున్నాడంటే, దాని కళ్లబడాలి,-ఆ కుప్పలు, అప్పుడుచూడు, ఆ గృహస్థు అవస్థ—అ సున్నం, ఇసుక, రోడ్డు నిండా చెల్లాచెదరయ్యేది. ఆ గృహస్థు దానిని కొట్టకూడదు. ఎంచేతంటే, దారిపోయేవారంతా దాని పక్షమే......

'అదేమిటయ్యా దేవుడులాంటి ప్రాణిఅని. దానిపలుకుబడి ఎంత!'

'కుక్కకీ దానికీ ఉన్న పాతవైరమేమిటి?'

'ఎంగిలి విస్తళ్లన్నీ కుక్కలసొత్తు. అది బహుకాలంగా వస్తున్న అంతర్రాష్ట్రీయ నియమం గదా. దీనికి ప్రజలవల్లవచ్చేకట్నాలు చాలక, ఆ నీచపు తిండికికూడా సిద్ధం. ఇక, ఆ కుక్కల్ని తరిమి, అకులైనా మిగల్చకుండా పుచ్చుకునేది.'

'ఇప్పుడు దీనికి జబ్బా?'

'అ జబ్బు లేదు, గిబ్బూలేదు. ఎవర్ని పడితేవారిని పొడవడం, పిల్లల్ని చూసి విజృంభించడం, మొదలుబెట్టేసరికి ప్రజలకి దీనిమీద మునుపుండే సద్బుద్ధిపోయింది. అ ప్రయత్నంగానూ, దౌర్జన్యముతోనూ సంపాదించిన ఆహారంతో పెరిగిన శరీరం దీనికిప్పుడు నిరుపయోగమే కాకుండా, భారంకూడా అయింది. మునుపటి జవసత్వాలూలేవు. పలుకుబడీలేదు.'

'పాపం, ఇదివరకు ఎంతఠీవిగా ఉండేదో గదా!'

ఆ ఠీవిచూచే మన వాళ్లందరూ ముగ్ధులయారు. దాని పలుకుబడికి ఆఠీవే చాలావరకూ కారణం.'

'దాన్నిచూస్తే నిజంగా నాకు జాలివేస్తున్నది. అంత దర్జాగా బ్రతికి అఖరుకి.........'

జాలి చెందడంకంటె మనంమాత్రం ఏం చెయ్యగలం! ఈ కరువురోజుల్లో దాన్ని పోషించగలమా! పైగా దానిది ఏనుగదాహం!'